## 9వ అధ్యాయము

# యేసుకు ప్రియమైన బోధకుడు

యేసుకు ప్రియమైన బోధకుడున్నాడంటే మీకు ఆశ్చర్యమేస్తున్నది కదూ! యేసు ప్రియమైన బోధకుడు లూథరన్, మెతడిస్ట్, పెంతుకోస్తు, ఆంగ్లికన్ లేదా ప్రెస్‌బిటిరియన్ కాదు కాని బాప్టిష్టు అంటే ఇంకా ఎక్కువ ఆశ్చర్యం కలిగిస్తుంది. మనకు ఆయనెవరో తెలుసు ఆయన బాప్తిస్మమిచ్చు యోహాను. ఆయన గూర్చి యేసు ఈ విధంగా పలికాడు.

స్త్రీలు కనినవారిలో బాప్తిస్మమిచ్చు యోహాను కంటె గొప్పవాడు పుట్టలేదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. అయినను పరలోక రాజ్యములో అల్పుడైన వాడు అతని కంటె గొప్పవాడు (మత్తయి 11:11).

అందరు "స్త్రీనుండి జన్మించిన" వారు అనునది యేసు ఉద్దేశ్యంలో బాప్తిస్మం ఇచ్చు యోహాను అందరికంటే గొప్పవాడు అని మరొక విధంగా చెప్పబడుతున్నది. యేసు ఆ విధంగా ఎందుకు భావించాడు అనునది ఆయన ఊహ అయివున్నది. యోహానులో ఉన్న ఆత్మీయ గుణగణాలను బట్టియే యేసు అతని గురించి అంత ఉన్నతంగా భావించాడు అని అనుకోవటం ఎంతైన సమంజసం. ఆవిధంగా ఉన్నచో మనము కూడా అతని ఆత్మీయ గుణగణాలను జాగ్రత్తగా అధ్యాయనం చేసి ఆ ప్రకారంగా నడుచుకోవటం మంచిది. యోహాను జీవిత చరిత్రలో అభినందించతగిన ఏడు ఆత్మీయ గుణలక్షణాలను ఇప్పుడు అధ్యాయనం చేద్దాము. యోహాను పరిచర్య ఒక సువార్తికుని మరియు ప్రవక్త యొక్క పరిచర్యను తెలియజేస్తున్నప్పటికీ అతని లోని ఏడు లక్షణాలు సువార్తచేయు వారందరికీ ఉపయోగపడతాయి. ఈ ఏడు విషయాలలో మొదటిది పరిశీలిద్దాం.

> నీవెవడవని అడుగుటకు యూదులు యెరూషలేము నుండి యాజకులను లేవీయులను యోహానునొద్దకు పంపినప్పుడు అతడిచ్చిన సాక్ష్యమిదే అతడు ఎరుగననక ఒప్పుకొనెను క్రీస్తును కానని ఒప్పుకొనెను. కాగా వారు మరి నీవెవడవు, నీవు ఏలీయావా అని అడుగగా అతడు కాననెను. నీవు ఆ ప్రవక్తవా అని అడుగగా కానని ఉత్తరమిచ్చెను. కాబట్టి వారు నీ వెవరవు? మమ్ము పంపినవారికి మేము ఉత్తరమియ్యవలెను గనుక నిన్ను గూర్చి నీవేమి చెప్పుకొనుచున్నావని అతని నడిగిరి. అందుకతడు-ప్రవక్తయైన యెషయా చెప్పినట్టు నేను ప్రభువు త్రోవ సరాళముచేయుడి అని అరణ్యములో ఎలుగెత్తి చెప్పు ఒకని శబ్దము అని చెప్పెను (యోహాను 1:19-23)

దేవుని పిలుపు యోహానుకు తెలిసి ముందుకు సాగిపోయాడు.

పరిచారకులు, దైవసేవకులు దేవుని పిలుపు గుర్తించి ముందుకు సాగిపోవుట చాలా ప్రాముఖ్యము. నీవు సువార్తికుడవైనట్లయితే నీవు కాపరిగా ఉండుటకు ప్రయత్నించవద్దు. నీవు ఉపాధ్యాయుడవైనట్లయితే ప్రవక్తగా ఉండుటకు ప్రయత్నించవద్దు. ఇలా చేసిన యెడల నీ ప్రయత్నము విఫలము చెంది నీవు నిరాశ చెందుతావు.

దేవుని పిలుపును ఎలా గుర్తించగలవు? ముందుగా నిన్ను పిలిచిన దేవుణ్ని వెదకుట ద్వార. రెండవదిగా నీకనుగ్రహించబడిన వరమును పరీక్షించుకొనుటద్వారా. దేవుడు నిన్ను సువార్తికునిగా పిలిచిన యెడల ఆ పనికి దేవుడు నిన్ను బలపరుస్తాడు. మూడవదిగ నీకు అనుగ్రహించిన ఆ వరము ఇతరులు గుర్తించి దానిని నిర్ధారణ చేయుట ద్వారా ఆ పిలుపును గుర్తించగలవు.

ఒకసారి నీ పిలుపును గుర్తించిన తరువాత ఏ ఆటంకము రానివ్వకుండ నీ హృదయపూర్వకంగా దానినంగీకరించి ముందుకు సాగిపోవాలి. అనేకులు తాము ఏమి చేయాలని దేవుడు ఉద్దేశిస్తున్నాడో అది చేయుటకు దేవుని కొరకు ఎదురుచూస్తువుంటారు. నోవహు దేవుడు వచ్చి ఓడ కట్టువరకు వేచివుండలేదు.

***పరిచర్య*** అను పదము కార్యము లేక పని అని కూడ పిలువబడుతున్నది. మన పిలుపును అంగీకరించి దానిని నెరవేర్చకుండ ఉండునట్లు సాతానుడు విశ్వప్రయత్నాలు చేస్తాడు. కాని ఆ శోధన జయించి ముందుకు సాగిపోవాలి. యొర్దాను నదీ తీరమున యోహాను ***ప్రప్రథమముగా సువార్త ప్రకటించుట*** ప్రారంభించాడు అని మనకు లేఖనములలో వ్రాయబడనప్పటికీ ఖచ్చితంగా ఆయన అక్కడ బోధించటం ప్రారంభించాడు అని నీవు తెలుసుకోవాలి. ఆయన బోధకు మొదట్లో ప్రేక్షకులు తక్కువ సంఖ్యలో గుమికూడివుంటారు ఆ తరువాత ఆ సంఖ్య పెరిగివుంటుంది. ప్రజలు యోహానుని హేళన చేసి ఆయన్ని హింసించి ఉంటారు. హింస అనుభవించాడని కచ్చితంగా చెప్పగలము. కాని అతన్ని ఎవరూ ఆపలేకపోయారు. పరిచర్యకు పిలిచిన దేవుణ్ని సంతోషపరచి ఆ కార్యము నెరవేర్చాలన్నదే అతనికున్న ప్రధాన లక్ష్యం. తుదకు యోహాను జయించాడు.

యోహాను లో మనము పాటించదగిన మొదటి ఆత్మీయ లక్షణము ఏమనగా: ***యోహాను తన పిలుపును గుర్తించి అది నెరవేర్చుటకు ముందుకు సాగెను .***

## యోహాను లోవున్న రెండవ లక్షణం

> ఆ దినమందు బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చి పరలోకరాజ్యము సమీపించియున్నది. మారు మనస్సు పొందుడని యూదయ అరణ్యములో ప్రకటించుచుండెను (మత్తయి 3:1-2).

యోహాను వర్తమానమును యేసు ఖచ్చితంగా ఆమోదించాడు. ఇదే వర్తమానము యేసు తాను వెళ్లిన చోటల్లా ప్రకటించేవాడు (మత్తయి4:17). యోహాను ప్రజలకు మారుమనస్సు పొందుమని పిలుపునిచ్చాడు వారి పాపపు జీవితమునుండి నీతి జీవితమునకు తిరుగమని బోధించాడు. దేవునితో సత్యసంబంధము మారుమనస్సు ద్వార ప్రారంభమవుతుందని మరియు

మారుమనస్సు పొందని వారు నిత్యనరకమునకు త్రోయబడతారు అని యోహానుకు బాగా తెలుసు.

అనేకమైన నవీన సువార్తికులవలె యోహాను దేవుని ప్రేమను గూర్చి ప్రస్తావించలేదు. యోహాను "వారి అవసరతల" గూర్చి చెప్పుట లేదు వారి అవసరతలను బట్టి వారికి ఆశపెడుతున్నట్లుగా "యేసును అంగీకరించుము" తద్వార "సమృద్ధికరమైన జీవితమును" అనుభవించమని ఆయన చెప్పలేదు. కేవలం క్రియల వలన రక్షింపబడలేము అన్నది వారు గుర్తించి వారు ప్రధానంగా మంచివారు కావటంచేత దేవుడు వారిని పరలోకమునకు తీసుకెళ్లటానికి ఇష్టపడుతున్నాడు అని చెప్పి వారిని నమ్మించలేదు. దేవుడేవిధంగా వారిగూర్చి తలంచాడో అదే విధంగా వారిని గూర్చి యోహాను తలంచాడు. తిరుగుబాటుదారులు వారి పాపమువలన శాశ్వతంగా నరకమునకు వెళ్ళే ప్రమాదం వుందని వారికి తెలియపరచాడు. వారికి రాబోయే ఉగ్రతను గూర్చి హెచ్చరించాడు. వారు తమ హృదయాలను ప్రవర్తనను మార్చుకోలేక పోయినట్లయితే నిత్యనరకానికి వెళ్ళుతారు అని వారికి స్పష్టంగా అర్థమగులాగున తెలియజేసాడు.

కావున యోహానులోని రెండవ ఆత్మీయ లక్షణం శిష్యుడిగా చేయు ప్రతి దైవసేవకుడు పాటించాలి అది ఏదనగా: ***దేవునితో సన్నిహిత సంబంధం ఉండాలంటే మొదటి మెట్టు మారుమనస్సు అని యోహాను ప్రకటించాడు.***

## యోహాను మూడవ లక్షణం

> ఈ యోహాను ఒంటె రోమముల వస్త్రమును మొలచుట్టు తోలు దట్టియు ధరించుకొనువాడు. మిడతలను అడవి తేనెయు అతనికి ఆహారము (మత్తయి 3:4).

యోహాను ఖచ్చితంగా నేటి ఈతరపు "సంపదకలిగిన బోధకుని" కోవకు చెందిన వాడు కాదు. వాస్తవానికి యోహాను వంటి బోధకుని వారి సంఘములలోనికి ఆహ్వానించరు. వారి వేదిక మీద నుంచొని ప్రసంగాలు చేయనివ్వరు కారణం అతడు మంచి దుస్తులు ధరించలేదు కనుక. యోహాను నిజమైన దైవ సేవకుడు, అతనికి ఈ లోక సంబంధమైన ధనము యందును మరియు తన వేషభాషల ద్వార ప్రజలను మెప్పించుటయందును ఏమాత్రం ఆసక్తి లేకుండెను. దేవుడు హృదయాన్ని చూస్తాడు అని అతనికి తెలుసు. ఆయన సామాన్యమైన జీవితాన్ని జీవించాడు. ఆయన జీవిత విధానము ఎవ్వరినీ తప్పుదోవ పట్టించలేదు ఎందుకంటే యోహాను ముఖ్య ఉద్దేశ్యము ధనము కాదని వారు గుర్తించారు గనుక. సువార్తను తమ స్వలాభాలకు ఉపయోగించుకునే ప్రపంచములోని అనేకమంది దైవసేవకులకు ఇది ఎంత వ్యతిరేకముగా ఉన్నది. క్రీస్తుకు వారు వ్యతిరేక ప్రతినిధులుగా వుండి దేవుని సేవకు భంగము కలిగిస్తున్నారు.

యేసుకు ప్రియమైన శిష్యుడిగా ఉండటానికి గల కారణం అతనిలోని మూడవ లక్షణం అది ఏదనగా: ***అతని సామాన్యమైన జీవనశైలి.***

## యోహాను లోని నాల్గవ లక్షణం

> అతడు తనచేత బాప్తిస్మము పొందవచ్చిన జన సమూహములను చూచి సర్పసంతానమా రాబోవు ఉగ్రతను తప్పించుకొనుటకు మీకు బుద్ధి చెప్పిన వాడెవడు? మారుమనస్సునకు తగిన ఫలములు ఫలించుడి అబ్రాహాము మాకు తండ్రి అని మీలో మీరనుకొని మొదలు పెట్టుకొనవద్దు. దేవుడు ఈ రాళ్ళవలన అబ్రాహామునకు పిల్లలను పుట్టింపగలడని మీతో చెప్పుచున్నాను (లూకా 3:7-8)

యోహాను పరిచర్య అనేకమంది హృదయాలను హత్తుకొనుచుండగా ఆయన తను చెప్పే సందేశంలో ఎక్కడా ఎప్పుడూ రాజీపడలేదు. బాప్తిస్మము పట్ల జనాధరణ పెరుగుతుండటం గమనించి యోహాను ప్రజల యొక్క ఉద్దేశ్యాన్ని అనుమానించటం జరిగింది. చివరకు శాస్త్రులు మరియు పరిసయ్యులు కూడా యోర్దాను నది యొద్దకు ప్రయాణమయ్యారు (మత్తయి3:7). అనేకమంది ఆ గుంపును వెంబడిస్తున్నారేమోనని అందోళన చెందాడు. వారు మోసపోకుండునట్లు ఆయన సర్వవిధాల చేయగలిగింది చేశాడు. బాప్తిస్మము పొందుట ద్వార మాత్రమే వారికి రక్షణ వస్తుందని వారు నమ్మట యోహానుకు ఇష్టం లేదు. లేదా కేవలం మారుమనస్సు పొందినంత మాత్రము చాలు నరకమునుండి తప్పించుకొనగలము అని అనుకొనుట కూడా యోహానుకు ఇష్టములేదు. నిజమైన మారుమనస్సు విధేయత అనెడి ఆత్మఫలమునిస్తుంది అని వారికి హెచ్చరించాడు.

చాలామంది యూదులు తాము అబ్రాహాము వంశావళి నుంచి వచ్చిన కారణంగా రక్షింపబడతాము అని అనుకున్నారు, కావున యోహాను ఆ తప్పుడు అభిప్రాయాన్ని బయలుపరచాడు.

యోహానులో మెచ్చుకోదగిన నాల్గవ లక్షణము: ప్రజలకు సత్యమును చెప్పుటకు అతను ఎంతో ఇష్టపడ్డాడు. మారుమనస్సు పొందనివాడు అపవిత్రుడు పరలోకమునకు వెళ్ళతాడు అని ఎవ్వరికీ అభయమివ్వలేదు.

## యోహాను లోని అయిదవ లక్షణము

యోహాను మారుమనస్సు పొందినట్లుగా అగుపడని వారికి వారిని మోసం చేయకూడదన్న ఉద్దేశ్యంతో బాప్తీస్మం ఇవ్వలేదు. అతను వారి పాపములను బట్టి పశ్చాత్తాపము పొందిన వారికి బాప్తిస్మమిచ్చాడు. ఆయన యొద్దకు వచ్చిన వారికి ఈ విధంగా హెచ్చరించాడు:

> ఇప్పుడే గొడ్డలి చెట్టువేరున ఉంచబడియున్నది గనుక మంచి ఫలము ఫలింపని ప్రతి చెట్టును నరకబడి అగ్నిలో వేయబడును. మారుమనస్సు నిమిత్తము నేను నీళ్ళలో మీకు బాప్తిస్మమిచ్చి యున్నాను... ఆయన చేట ఆయన చేతిలో వున్నది. ఆయన తన కళ్ళమును బాగుగా శుభ్రము చేసి గోధుమలను కొట్టులో పోసి ఆరని అగ్నితో పొట్టును కాల్చివేయునని వారితో చెప్పెను (మత్తయి3:10-12).

నరకము గురించిన సత్యమును చెప్పుటలో యోహాను వెనుకాడలేదు. ఈ అంశమును అనేకమంది బోధకులు దాటవేస్తుంటారు. ఎందుకంటే వారు పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలనే చూస్తుంటారు కాని దేవుని రాజ్యం కొరకు ఆత్మలను సంపాదించాలనే ధ్యాసే ఉండదు. యేసు కొండమీది ప్రసంగం : పరిశుద్ధులు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొందురు అన్న మాటలనే యోహాను కూడా ప్రకటించాడు. మంచి ఫలములు ఫలింపని వారు అగ్నిగుండములోనికి త్రోయబడుదురు.

ఒకవేళ యోహాను గనుక నేడు జీవించి ఉన్నట్లయితే, అనేక మంది క్రైస్తవులు అతనిని ‘‘నరకాగ్ని గంధకము బోధించే బోధకుడు’’ లేదా ‘‘చీకటి అంతిమ నాశనముల గురించి చెప్పే ప్రవక్త’’ ‘‘జనులను ఆకర్శించని వాడు’’ లేదా ‘‘వ్యతిరేకి’’ ‘‘ఖండించువాడు’’ అని నిందించేవారు. అందులో సందేహమే లేదు. అయినను యోహాను యేసుకు ప్రియమైన బోధకుడు. ఆయనలోని అయిదవ లక్షణము: ***యోహాను నరకము గురించి బోధించాడు. ఎటువంటి వారు నరకములోనికి త్రోయబడుతారు అన్నది వివరించాడు***. ఆసక్తికరమైన విషయమేమంటే యోహాను సందేశాన్ని లూకా ‘‘సువార్త’’గా ప్రకటించాడు (లూకా 3:18).

## యోహానులోని ఆరవ లక్షణము

యోహాను దేవుని చేత ఘనంగా వాడబడుచున్నప్పటికీ జనాదరణ పొందుతున్నప్పటికీ యేసు ముందు తాను ఎందుకు పనికిరానివాడు అన్నది అతనికి తెలుసు అందుకే ఎల్లప్పుడు యేసును ఘనపరిచేవాడు:

> మారు మనస్సు నిమిత్తము నేను నీళ్ళలో మీకు బాప్తిస్మమిచ్చు చున్నాను. అయితే నా వెనుక వచ్చుచున్నవాడు నాకంటే శక్తిమంతుడు ఆయన చెప్పులు మోయుటకైనను నేను పాత్రుడను కాను. ఆయన పరిశుద్ధాత్మలోను అగ్నితోను మీకు బాప్తిస్మమిచ్చును (మత్తయి 3:11)

ఈ రోజుల్లో గొప్పలు చెప్పుకుంటూ అహంభావవముగల ‘‘సేవకులకు’’ తన్ను తాను తగ్గించుకొనే యోహానుకు ఎంత వ్యత్యాసముందో చూడండి. వారి పరిచర్య పత్రికలలో యేసును గూర్చిన సందేశాలకంటే కూడా వారికి సంబంధించిన రంగు రంగుల చిత్రాలు ప్రతి పేజీలో కనిపిస్తాయి. వారిని వెంబడించే విశ్వాసులముందు పెద్ద వేదికల మీద నెమలి వలె నడుస్తు ఒక ప్రదర్శనలో వున్నట్లుగా వుంటారు. వారు తమని ఎవ్వరూ అంటుకోకూడదు అన్నట్లుగా అందరికీ అందనంత దూరంలో ప్రత్యేకంగా వుంటూ తమకు తామే అధికులము అన్న భావనతో నిండి వుంటారు. మరికొందరు దేవునికి దూతలకు కూడా ఆజ్ఞాపిస్తుంటారు! అయినప్పటికి యోహాను యేసు చెప్పులు మోయుటకైనను పాత్రుడను కాను అన్నాడు. ఈ చర్య చాలా తగ్గింపు స్వభావముగల ఒక బానిసగా ఉండాలనుకున్న దానికి నిదర్శనము. యేసు, యోహాను వద్దకు బాప్తిస్మము పొందుటకొచ్చినప్పుడు బాప్తిస్మమిచ్చుటకు నిరాకరించాడు. ఈ యేసే క్రీస్తు అని తెలుసుకున్న తరువాత వెంటనే అందరికి ఆయనను చూపిస్తూ, ‘‘ఇదిగో లోక పాపములను మోసుకొని పోవు దేవుని గొర్రెపిల్ల’’ అని ప్రకటించాడు (యోహాను 1:29).

"ఆయన హెచ్చింపబడాలి నేను తగ్గించబడాలి" (యోహాను 3:30) అనునది యోహాను యొక్క తగ్గింపు స్వభావాన్ని సూచిస్తున్నది.

యోహాను లోని ఈ ఆరవ లక్షణం అతను యేసుకు ప్రియమైన బోధకుడు అవుటకు సహాయపడింది : ***యోహాను తన్ను తాను తగ్గించుకొని యేసును హెచ్చించెను. తన వ్యక్తిగత ఘనత పట్ల అతనికి ఎటువంటి ఆసక్తి లేకుండెను.***

## యోహానులోని ఏడవ లక్షణము

నేటి బోధకులు సాధారణమైన విషయాలు అస్పష్టంగా మాట్లాడి ఎవరికైన కోపం తెప్పిస్తుంటారు. "దేవుడు మనలను మంచి చేయమన్నాడు" అని బోధించుట ఎంత సులభము! అటువంటి ప్రసంగ సమయములో నిజక్రైస్తవులు మరియు అబద్ధ క్రైస్తవులు ఏక కంఠముతో "ఆమెన్" అని అంటుంటారు. అనేక మంది బోధకులు లోకములోని ఘోరమైన పాపాల గూర్చి ప్రస్తావిస్తుంటారు కాని అటువంటి పాపాలే తమ సంఘంలో జరుగుతుండగా వాటి గూర్చి మాట్లాడరు. ఉదాహరణకు వారు అశ్లీలమైన చిత్రాల గురించి తమ ఆగ్రహాన్ని వ్యక్తపరుస్తుంటారు కాని తమ సంఘస్తులే అటువంటి చిత్రాలు చూస్తుంటారు వాటిని సేకరిస్తుంటారు అని తెలిసి కూడా వారి గురించి ప్రస్తావించటానికి భయపడుతుంటారు. వారియందు ఉన్న భయం వారిని అణిచిపెట్టేస్తోంది.

నిస్సంకోచంగా ప్రసంగించటానికి యోహాను ఎప్పుడూ వెనకాడలేదు. లూకా లో ఈవిధంగా తెలపబడివుంది:

> అందుకు జనులు అలాగైతే మేమేమి చేయవలెనని అతని నడుగగా అతడు రెండు అంగీలుగలవాడు ఏమియు లేనివానికియ్యవలెననియు ఆహారముగల వాడును అలాగే చేయవలెననియు వారితో చెప్పెను. సుంకరులును బాప్తిస్మము పొందవచ్చి - బోధకుడా మేమేమి చేయవలెనని అతని నడుగగా అతడు మీకు నిర్ణయింపబడిన దానికంటే ఎక్కువ తీసికొనవద్దని వారితో చెప్పెను. సైనికులును మేమేమి చేయవలెనని అతనినడిగిరి. అందుకు అతడు ఎవరిని బాధపెట్టకయు ఎవని మీదను అపనింద వేయకయు మీ జీతములతో తృప్తి పొందియుండుడని వారితో చెప్పెను (లూకా 3:10-14).

ఆసక్తికరమైన విషయమేమంటే యోహాను ఇచ్చిన ఆరు సూచనలలోని అయిదింటిలో ధనము లేదా భౌతిక విషయాల గురించి ప్రస్తావించబడింది. గృహ నిర్వాహకత్వము గురించి బోధించుటకు యోహాను ఏమాత్రం భయపడలేదు ఎందుకంటే ఈ గృహనిర్వాహకత్వం రెండవ గొప్ప ఆజ్ఞకు సంబంధించింది గనుక. యోహాను "నూతన విశ్వాసులు" ఈ "విలువైన" అంశమును అర్థముచేసుకునే వరకు బోధించకుండా ఉండలేదు. దేవుణ్ని మరియు ధనమును సేవించుట అసాధ్యమని యోహాను నమ్మాడు. అందుకని

గృహనిర్వాహకత్వము ప్రారంభం నుండి చాలా ప్రాముఖ్యమైనదిగా పేర్కొనబడింది.

ఇది మరొక విషయాన్ని గుర్తుచేస్తోంది. యోహాను అల్పమైన వాటికి ప్రాధాన్యత ఇవ్వలేదు. దుస్తుల గురించి ఇతర అపవిత్రమైన కార్యముల గురించి బహిరంగంగా కనిపించే వాటివిషయమై పదేపదే చెప్పలేదు. యోహాను "ధర్మశాస్త్రములోని ప్రధాన విషయమే" కేంద్రీకరించాడు (మత్తయి23:23). ఇక్కడ ప్రాముఖ్యమైన విషయము నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించుట మరియు నీవు ఇతరులు నీకు ఏమి చేయాలని కోరుకుంటున్నారో అదే ఇతరులకు చేయవలెను. ఈ విషయం యోహానుకు తెలుసు. అంటే ఆహారములేని వారికి ఆహారము ఎంచుకొనుట కనీసవసతులు లేని వారికి సహాయపడుట ఇతరులతో యదార్థముగా వ్యవహరించుట, మరియు మనకు కలిగిన దానిలోనే తృప్తి చెందుట.

ఈ లక్షణమే యేసు యోహానును ప్రేమించేలా చేసింది: ***అతను అస్పష్టంగా చెప్పటం లేదు. కాని దేవుడిని సంతోషపరిచే విషయాల గురించి స్పష్టంగా చెప్పాడు చివరకు గృహనిర్వాహకత్వపు విషయాలను కూడా ఎంతో స్పష్టంగా చెప్పాడు మరియు అత్యంత ప్రాముఖ్యమైన విషయాలను కూడా దృష్టించాడు.***

## ముగింపు

ఒక కాపరి లేక ఉపాధ్యాయుని పరిచర్య విస్తారమైన అంశముల మీద ఆధారపడి ఉన్నది. యోహాను మారుమనస్సు పొందని వానికి బోధిస్తున్నాడు. కాపరులు మరియు ఉపాధ్యాయులు మారుమనస్సు పొందిన వారికి బోధిస్తువుండాలి. వారి బోధ యేసు శిష్యులకు బోధించిన దాని మీద ఆధారపడి ఉండాలి మరియు క్రొత్త నిబంధనలో వ్రాయబడిన పత్రికలను ఆధారం చేసుకొని బోధించాలి.

మన శ్రోతలు ఎలాంటి వారు అని గుర్తించుటలో మనం అనేక మారులు విఫల మవుతుంటాము. ఈ రోజుల్లో పాపులకు వారు పరిశుద్ధులుగా ఉద్దేశించి ప్రసంగిస్తుంటారు. కేవలం ప్రజలు దేవాలయములో కూర్చున్నారు కదా అని వారికి రక్షణ అభయమును లేక హామి ఇవ్వలేము మరిముఖ్యంగా లోకస్తులకు ఈ కాలంలో అనేక మంది మిలియన్ల "బాప్తిస్మమిచ్చు యోహానులు "దేవాలయాల్లో వేదికల మీద ప్రసంగించుటకు అవసరము. ఈ సవాలుకు నీవు స్పందించగలవా? నీవు కూడా యేసుకు ప్రియమైన బోధకునిగా వుండగలవా?

